సాక్షి
ప్రకాశం
మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024



కొండపిలో జెండా ఎగరేస్తాం

కొండపి నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తామని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు.

- 8లో..



అభివృద్ధి బాధ్యత నాది..

మార్కాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాది.. అన్నా రాంబాబును గెలిపించే బాధ్యత మీది అని ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
41/27

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

ఒంగోలు నగరం జన సంద్రమైంది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి అభిమానులు పోటెత్తారు. సార్వత్రిక సమరంతో అభిమాన నేత సిక్సర్ కొట్టాలంటూ సమరోత్సాహంతో కదిలారు. ఉదయం నుంచే భానుడు ప్రతాపాన్ని చూపిస్తున్నా లెక్కచేయకుండా చిన్నా పెద్దా అంతా దండులా కదలి వచ్చారు. జై జగన్, జై వాసన్న అంటూ వారు చేసిన నినాదాలతో నగరం హోరెత్తిపోయింది. అడగడుగునా పూలవర్షం కురిపించారు. భారీ గజమాలలతో స్వాగతం పలికారు.



బాలినేని శ్రీనివాసరెడ్డి నామినేషన్ ర్యాలీకి స్వచ్ఛందంగా తరలి వచ్చిన అభిమానులు, కార్యకర్తలు

జన ప్రవాహం.. సమరోత్సాహమై..

- ఒంగోలులో బాలినేని నామినేషన్‌కు పోటెత్తిన అభిమాన గణం
- ర్యాలీలో బాలినేనితో పాటు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డి
- ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు
- భారీ గజమాలలతో స్వాగతాలు



ర్యాలీలో అభివాదం చేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, టీజేఆర్ సుధాకర్‌బాబు, గంగాడ



విల్లంబు ఎక్కు పెడుతున్న బాలినేని, చెవిరెడ్డి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వైఎస్సార్ సీపీ ఒంగోలు అభ్యర్థిగా సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆర్డీఓ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి సుబ్బారెడ్డికి తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా నగరంలో నిర్వహించిన భారీ ర్యాలీ ''నభూతో నభవిష్యత్''అన్న చందంగా సాగింది. గతంలో ఎన్నడూ ఇంత పెద్ద జన సందోహాన్ని చూడలేదన్నది ఒంగోలు నగర ప్రజల మాటలుగా ఉంది. ఈ ఎన్నికల్లో భారీ విజయం సాధించి 'సిక్సర్' కొట్టాలంటూ అభిమాన గణం ప్రవాహంలా తరలివచ్చింది. స్వచ్ఛందంగా తరలివచ్చిన అశేష జనవాహినితో నగరం జనసంద్రంగా మారింది.

2 గంటల పాట సాగిన భారీ ర్యాలీ...

నామినేషన్ సందర్భంగా జరిగిన ర్యాలీ రెండు గంటల పాటు సాగింది. జనంతో నగరంలోని ప్రధాన వీధులు కిక్కిరిపోయాయి. ఎండలు మండుతున్నా ఉదయం ఎనిమిది గంటల నుంచే కర్నూలు రోడ్డు నుంచి వంతెన వద్దకు పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు బయలు దేరారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ర్యాలీ మధ్యాహ్నం 12 గంటల వరకు సాగింది. ర్యాలీ చర్చి సెంటర్ వరకు రావటానికి రెండు గంటల పాటు సాగిందంటే జన సందోహం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ర్యాలీ కర్నూలు రోడ్డులో గుండా ఆర్టీసీ డిపో, అరవై అడుగుల రోడ్డు, పాత గుంటూరు రోడ్డు జంక్షన్, అద్దంకి బస్టాండ్ సెంటర్, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, పాత మార్కెట్ మీదుగా భారీ ర్యాలీ జరిగింది. బాలినేనితో పాటు ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డి, యువనేత ప్రణీత్ రెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాతలతో పాటు మరికొంత మంది వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు కదం వాహనంపై ఉన్నారు. అడుగడుగునా భారీ క్రేన్‌లతో భారీ గజమాలలు వేసి పార్టీ శ్రేణులు తమ అభిమానాన్ని చాటుకున్నారు. బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్దకు రాగానే వైఎస్సార్ సీపీ నాయకుడు కావటి రవి ఆధ్వర్యంలో విల్లంబు అందించారు.

పాత మార్కెట్ నుంచి నడుచుకుంటూ ర్యాలీగా...

కర్నూలు రోడ్డు నుంచి ప్రత్యేక వాహనంలో ర్యాలీగా వచ్చిన బాలినేని, చెవిరెడ్డి, సంతనూతల పాటు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర బాబులతో పాటు పార్టీ శ్రేణులు పాత మార్కెట్ వద్ద నుంచి వాహనం దిగి నడుచుకుంటూ రిటర్నింగ్ అధికారి ఉన్న ఒంగోలు ఆర్డీఓ కార్యాలయం వరకు వెళ్లారు. పాత మార్కెట్, దర్గా సెంటర్, ట్రంక్ రోడ్డు, మిరియాల పాలెం సెంటర్, హెచ్‌సీఎం మీదుగా నడుచుకుంటూ వెళ్లి నామినేషన్ వేశారు. మధ్యలో పాత మార్కెట్‌కు ఎదురుగా ఉన్న నీలంపాలెం సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ యువనేత బాలినేని ప్రణీత్ రెడ్డి వాహనం దిగి అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకుడు పంది రత్నరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. భారీ ర్యాలీలో యువనేత ప్రణీత్ రెడ్డి సతీమణి శ్రీకావ్య ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాలినేని శ్రీనివాస రెడ్డి, శచీదేవి దంపతులు, ప్రణీత్ రెడ్డి, శ్రీ కావ్య దంపతులు తొలుత టంగుటూరు మండలం వల్లూరమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు చేయించారు. నామినేషన్ పత్రాలు అమ్మవారి పాదాల వద్ద ఉంచి ఆశీర్వాదం తీసుకున్నారు. అంతకు ముందు లాయరుపేట సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు చేయించారు. అక్కడ కూడా నామినేషన్ పత్రాలను షిర్డీ సాయిబాబా పాదాల వద్ద ఉంచి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో బాలినేనితో పాటు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, లిడ్‌క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, పార్టీ నాయకులు కఠారి శంకర్, గోలి తిరుపతి రావు, ఒంగోలు ఎంపీపీ మల్లిఖార్జున రెడ్డి, డిప్యూటీ మేయర్లు వెలనాటి మాధవరావు, వేమూరి సూర్యనారాయణ, గొర్రెపాటి శ్రీనివాసరావు, బొట్ల సుబ్బారావు, కుట్టుబోయిన కోటి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు:

బాలినేని నామినేషన్ ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా పలు రకాల కళా ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా కేరళ వాయిద్యాలు ఉర్రూతలూగించాయి. పొడుగు కాళ్ల వ్యక్తులు ర్యాలీలో ప్రత్యేకంగా నిలిచారు. గిరిజన నృత్యాలు, నెమలి పింఛాలు ధరించి చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. డోలు, డప్పులు, గిరిజన సాంప్రదాయ నృత్యాలు కూడా ఆకట్టుకున్నాయి.



నామినేషన్ ర్యాలీలో ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ప్రణీత్‌రెడ్డిలను భారీ గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

ఈ ఎన్నికలతో సిక్సర్ కొడతా

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఎంపీతో పాటు అన్నీ శాసనసభ నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం భారీ ర్యాలీతో వచ్చిన బాలినేని.. ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డితో కలిసి ఆర్డీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి సుబ్బారెడ్డికి నామినేషన్‌ను దాఖలు చేశారు. అనంతరం మీడియా పాయింట్‌లో బాలినేని మాట్లాడుతూ ఇప్పటికి ఒంగోలు శాసనసభ నియోజకవర్గం నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపించారని, ఈ ఎన్నికలతో సిక్సర్ కొడతానని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన, అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే వైఎస్సార్ సీపీ విజయానికి సోపానాలన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల జరగాలని, అందుకు ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలకు లోబడి పనిచేయాలన్నారు. తెలుగుదేశం నాయకులు రెచ్చగొట్టేలా ప్రయత్నిస్తున్నారని, ప్రచారాల్లో దాడులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. గెలిచి అధికారంలోకి రాగానే ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతి రోజు తాగునీరు ఇచ్చేలా రూ.350 కోట్లతో పనులు చేపడతామని, నగరంలో రూ.400 కోట్ల అంచనా వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మిస్తానన్నారు. నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుతానన్నారు. నగర ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని, స్థలాలు ఇచ్చిన అందరికీ ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేస్తామన్నారు. చిరిసారిగా పోటీ చేస్తున్న తనను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో అందరివాడుగా పేరున్న వాసన్నను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ వాసన్న ఒంగోలు నియోజకవర్గ ప్రజలకు ఒక భరోసా అని, ఐదు పర్యాయాలు గెలిచాడంటే ప్రజలకు ఆయనపై ఎంత నమ్మకం ఉందో అర్థమవుతుందన్నారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన బాలినేనికి ఎటువంటి భేషజాలు లేవని ప్రజలు ఎవరైనా నేరుగా తనను కలిసి మాట్లాడేలా ఉంటాడని అన్నారు. పార్టీ నాయకుడు గొర్రెపాటి శ్రీను మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రజలకు అండగా నిలిచే బాలినేనిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ నగరంలో ప్రజల తాగునీటి సమస్య తీరాలన్నా, దోమల బెడద తగ్గేలా అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ రావాలన్నా బాలినేని గెలవాలన్నారు.

నామినేషన్ల జాతర

- ఒక్కరోజే 51 నామినేషన్లు
- పార్లమెంట్‌కు 5, అసెంబ్లీకి 46



ఒంగోలులో బాలినేని నామినేషన్..



కొండపిలో నామినేషన్ ఇస్తున్న ఆదిమూలపు సురేష్



మార్కాపురంలో నామినేషన్ సమర్పిస్తున్న అన్నా రాంబాబు

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో సోమవారం జిల్లా వ్యాప్తంగా 42 మంది 51 నామినేషన్లు దాఖలు చేశారు. ఒంగోలు పార్లమెంట్‌కు ఐదు, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 47 నామినేషన్లు వచ్చాయి. సోమవారం అత్యధికంగా నామినేషన్లు దాఖలు కావడం గమనార్హం. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీగా టీడీపీ నుంచి మాగుంట శ్రీనివాసుల రెడ్డి, మాగుంట గీతాలత, మరో ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులు కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి ఏఎస్ దినేష్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ సీపీ నుంచి బాలినేని శ్రీనివాసరెడ్డి, బాలినేని ప్రణీత్ రెడ్డి, ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు, కొండపి నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఆదిమూలపు సురేష్, ఆదిమూలపు విశాల్, ఇతరులు ఒకరు, మార్కాపురం అసెంబ్లీకి సంబంధించి వైఎస్సార్ సీపీ నుంచి అన్నా వెంకట రాంబాబు, టీడీపీ నుంచి కందుల నారాయణరెడ్డి, కాంగ్రెస్ నుంచి సైదా, ఇతరులు ఇద్దరు, యర్రగొండపాలెం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నుంచి తాటిపర్తి చంద్రశేఖర్, కాంగ్రెస్ అభ్యర్థితోపాటు మరో నలుగురు ఇతర అభ్యర్థులు నామినేషన్ వేశారు. దర్శి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, టీడీపీ నుంచి గొట్టిపాటి లక్ష్మి, లలిత్ సాగర్ కడియాల, స్వతంత్ర అభ్యర్థి ఒకరు, సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా మేరుగు నాగార్జున, కాంగ్రెస్, ఇతరులు ఆరుగురు, గిద్దలూరు నుంచి టీడీపీ నుంచి ముత్తుముల పుష్పలీల, స్వతంత్ర అభ్యర్థులు నలుగురు, కనిగిరి నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా దద్దాల నారాయణ, టీడీపీ నుంచి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఎరమారెడ్డి విజయలక్ష్మి నామినేషన్లు దాఖలు చేశారు.

సర్కార్ విజయభేరి

- పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు
- గత ఏడాదికంటే మెరుగైన ఉత్తీర్ణత శాతం
- గత ఏడాది 73.74 శాతం, ఈ ఏడాది 91.21 శాతం ఉత్తీర్ణత
- వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు 157
- సున్నా శాతం ఉత్తీర్ణత పాఠశాలలు సున్నా
- ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత
- ఈనెల 30లోగా రీకౌంటింగ్/ రీవెరిఫికేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



ధీరజ్ (591)



హనుమంతు (589)



కొలు యశస్విని (588)



బి.షణ్ముఖరెడ్డి (586)



యరదేశి నాగపుష్ప (585)

ఒంగోలు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విజయభేరి మోగించారు. గత ఏడాది 73, 34 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది ఏకంగా 91.21 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచింది. ఎప్పటిలాగే బాలికలు ఈ ఏడాది కూడా తామే ముందంజ అంటూ బాలుర కంటే అత్యధిక ఉత్తీర్ణత సాధించారు. జిల్లా వ్యాప్తంగా 157 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటాయి.

జిల్లాలో ఉత్తీర్ణత శాతం 91.21 శాతం:

పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర నేతృత్వంలో నిర్వహించారు. ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు (రెండు రోజుల్లో ఎన్నికల కమిషన్ శిక్షణకు హాజరుకావాల్సి వచ్చినా) నిర్ణీత సమయంలోనే మూల్యాంకనం ముగించి శెహభాష్ అనిపించుకున్నారు. జిల్లా పరిశీలకులుగా జాయింట్ డైరెక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ ప్రత్యక్షంగా అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు తగు సూచనలు ఇవ్వడంతో జిల్లాలో మాస్ కాపీయింగ్ అనే పదానికి అర్థం కూడా లేకుండా పోయింది. పటిష్టంగా జరిగిన పరీక్షల్లో 14684 మంది బాలురు హాజరుకాగా వారిలో 13208 మంది (89.95శాతం), 14511 మంది బాలికలు హాజరుకాగా వారిలో 13422 మంది (92.50 శాతం) సాధించారు. మొత్తంగా 29,195 మందికిగాను 26,630 మంది విజయం సాధించారు. వీరిలో 21,316 మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులు కాగా, 3618 మంది ద్వితీయ శ్రేణిలోను, 1696 మంది తృతీయ శ్రేణిలో రాణించారు. 2565 మంది మాత్రం ఉత్తీర్ణత సాధించలేకపోయారు. అయితే 91.21 శాతం అంటే గత ఏడాది కంటే 17.47 శాతం విద్యార్థులు అత్యధికంగా ఉత్తీర్ణత సాధించడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర పాఠశాలల ఉపాధ్యాయులను అభినందించారు. ఈ ఏడాది మరింతగా రాణించి మరింత ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేద్దామని పిలుపునిచ్చారు.

యాజమాన్యం వారీగా ఉత్తీర్ణత శాతం:

ఎయిడెడ్ 77 శాతం, బీసీ వెల్ఫేర్ 99, ప్రభుత్వ పాఠశాలలు 79, ప్రభుత్వ గిరిజన పాఠశాలలు 67 శాతం, కేజీబీవీ 92 శాతం, మున్సిపల్ 82, ఏపీ మోడల్ స్కూల్స్ 20, ప్రైవేటు 97, ఏపీ రెసిడెన్షియల్ 100 శాతం, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ 95, ఏపీ గిరిజన సంక్షేమ పాఠశాలలు 87 శాతం, జిల్లా ప్రజా పరిషత్ 87 శాతం వెరసి అన్ని యాజమాన్యాల్లో కలిసి 91.21 శాతం ఉత్తీర్ణత సాధించారు.

నేటినుంచి రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తులు:

రీకౌంటింగ్ లేదా రీవెరిఫికేషన్ కోసం బుధవారం నుంచే దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి ప్రకటించారు. వీరు ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రీకౌంటింగ్ కోసం రూ.500, రీ వెరిఫికేషన్ కోసం రూ.1000 చొప్పున ఒక్కో జవాబు పత్రానికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లింపులు స్వీకరించరు. డెబిట్‌కార్డు/ క్రెడిట్ కార్డు/ యూపీఐ/ ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు:

మార్కాపురం మండలం మిట్టమీదపల్లి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి ధీరజ్ 591 మార్కులు, త్రిపురాంతకం మండలం గణపవరం ఏపీఆర్ స్కూల్ విద్యార్థి ఈ హనుమంతు అనే విద్యార్థి 589 మార్కులు, బేస్తవారిపేట మండలం గలిజేరుగుళ్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థి నారు భరత్ 589 మార్కులు, యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్.సుమయ 589 మార్కులు, జరుగుమల్లి మండలం కామేపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కొలు యశస్విని 588 మార్కులు, మార్కాపురం జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని సత్య రజిత 586 మార్కులు, పీసీపల్లి మండలం గుంటుపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి బి.షణ్ముఖరెడ్డి 586 మార్కులు, కంభం మండలం రావిపాడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని యరదేశి నాగపుష్ప 585 మార్కులు, వెలిగండ్ల మండలం మొగళ్లూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని పి.స్నేహ 585 మార్కులు, సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి కరాటే మణితేజ 585 మార్కులు, కనిగిరి మండలం కొత్త ఏరువారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వి.మధుసూదన్‌రెడ్డి 583 మార్కులు, వీర వెంకట సాయి 583 మార్కులు, మద్రిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నంగునూరి ప్రత్యూష 582 మార్కులు, వెలిగండ్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని జాస్మిన్ 580 మార్కులు సాధించారు.

నాలుగు రోజుల్లోనే ఆన్‌లైన్‌లో మార్కుల జాబితాలు

ఇంటర్మీడియెట్ కోర్సులో చేరే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఫలితాలు ప్రకటించిన నాలుగు రోజుల్లోనే వెబ్‌సైట్‌లో మార్కుల జాబితాలు ఉంచుతున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం ప్రకటించింది. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా పాఠశాల హెడ్మాస్టర్ లాగిన్ ద్వారా మార్కుల జాబితాలు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంది. ఇక డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.రిజల్ట్స్.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా పాఠశాలకు వెళ్లకుండానే విద్యార్థులు నేరుగా తమ మార్కుల జాబితాను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

పార్టీ రాష్ట్ర పదవుల్లో జిల్లా వాసులకు స్థానం



డాక్టర్ యాదాల అశోక్



ఉడుముల శ్రీనివాసరెడ్డి



సోమిశెట్టి సురేష్‌బాబు

ఒంగోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పదవుల్లో జిల్లా వాసులకు స్థానం కల్పించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

పార్టీ రాష్ట్ర కమిటీ:
కార్యదర్శులు: ఉడుముల శ్రీనివాసరెడ్డి, డాక్టర్ యాదాల అశోక్

పార్టీ రాష్ట్ర ఐటీ విభాగం కమిటీ:
కార్యదర్శి: ఉన్నం వెంకట సురేష్ బాబు చౌదరి

పార్టీ బీసీ సెల్ కమిటీ:
ప్రధాన కార్యదర్శులు: సయ్యద్ గౌస్ మొహిద్దీన్, సౌదాగర్ రహంతుల్లా

రాష్ట్ర వాణిజ్య విభాగం కమిటీ:
కార్యదర్శి: సోమిశెట్టి సురేష్‌బాబు

మే 13న వ్యాపార సంస్థలకు సెలవు

ఒంగోలు టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 13వ తేదీ అన్నీ రకాల దుకాణాలు, షాపులు, వ్యాపార సంస్థలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా ఉప కార్మిక కమిషనర్ ఎస్ శ్రీనివాస కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక చట్టం ప్రకారం ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. ఏదైనా వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థల్లో పనిచేసే ఓటరుకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే జరిమానాతో కూడిన శిక్ష విధిస్తామని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీలోకి 30 కుటుంబాలు


వైఎస్సార్ సీపీలో చేరిన లారీలకుంట మహిళలు

ఒంగోలు టౌన్: ఎన్నికలు దగ్గర పడేకొద్ది నగరంలో తెలుగుదేశం పార్టీకి దెబ్బ మీద దెబ్బ పడుతోంది. నగరంలోని అనేక డివిజన్‌లలో వందల సంఖ్యలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. సోమవారం నగరంలోని లారీలకుంటలో తెలుగుదేశం పార్టీకి చెందిన షేక్ నూర్, అంకమ్మ ఆధ్వర్యంలో 30 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బాలినేని మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో జగనన్న గెలిస్తే పేదల రాజ్యం ఏర్పాటు అవుతుందన్నారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీలు వేసి అవ్వాతాతలకు ఇచ్చే పింఛన్లకు కూడా ప్రతినెలా డబ్బులు వసూలు చేయడం ప్రతి ఒక్కరికీ తెలిసిందే అన్నారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ బాలినేని శ్రీనివాసరెడ్డితో కలిసి జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లేయాలని కోరారు. నగరంలో ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇళ్లు కట్టించి ఇస్తామని చెప్పారు. కుటుంబం బాగుపడితే ఊరు బాగుపడుతుందని, ఊరు బాగు పడితే రాష్ట్రం బాగుపడుతుందని, రాష్ట్రం బాగుపడితే దేశం బాగుపడుతుందని జగనన్న ఆలోచన అని, అందుకే రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో సంతోషాలు నింపేందుకు నవరత్నాలు అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో బొమ్మేపల్లి మురళి, 50వ డివిజన్ అధ్యక్షుడు జల్లిపల్లి సురేష్, షేక్ అబూబకర్, షేక్ జుబేదా బాజీ, మున్నా, సాదిక్, ఒంగోలు బుజ్జి, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

డోంట్ కేర్..!



- భర్త ఉగ్ర నరసింహారెడ్డితో నామినేషన్ దాఖలులో పాల్గొన్న డాక్టర్ కవిత
- ప్రభుత్వ ఉద్యోగై ప్రత్యక్షంగా ఎన్నికల ప్రచారం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కనిగిరి టీడీపీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. కనిగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు దాఖలు చేసే సమయంలో ఉగ్ర నరసింహారెడ్డితో పాటు ఆయన భార్య డాక్టర్ కవితా కూడా పక్కనే ఉన్నారు. డాక్టర్ కవిత గుంటూరు జీజీహెచ్ (ప్రభుత్వ ఆస్పత్రిలో) గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ విభాగంలో హెచ్ఓడీగా పనిచేస్తున్నారు. అయితే ఆమె గత రెండ్రోజులుగా కనిగిరిలో ప్రచారం చేస్తున్నారు. దీన్ని ఎన్నికల అధికారులు పట్టించుకోకపోవడం పట్ల సాక్షిలో ప్రత్యేక కథనం ప్రచురించారు. ప్రభుత్వ ఉద్యోగై సెలవు పెట్టి ప్రచారంలో పాల్గొంటున్నారని ఎన్నికల కమిషన్‌కు కొందరు వీడియోలు, ఫొటోలు పంపి ఫిర్యాదు చేశారు. అయినా డాక్టర్ కవిత 'డోంట్ కేర్' అన్నట్లు సోమవారం కూడా నేరుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్దకు టీడీపీ అభ్యర్థి తరఫున వెళ్లి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఎన్నికల అధికారులు

ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి నేరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా.. టీడీపీ అభ్యర్థికి మద్దతుగా నేరుగా నామినేషన్ పత్రాల దాఖలుకు వచ్చినా.. దీనిపై పత్రికల్లో కథనాలు వస్తున్నా.. ఎన్నికల అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరైనా వచ్చి నేరుగా తమకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేస్తే చూద్దాం లే.. అన్నట్లు వ్యవహరిస్తున్న ఎన్నికల అధికారుల తీరుపై ప్రజల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కొండపిలో జెండా ఎగరేస్తా

- విజయోత్సవ సభ నిర్వహిస్తా
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సురేష్


ర్యాలీలో మంత్రి, సురేష్, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి తదితరులు


సింగరాయకొండలో ర్యాలీ..

సింగరాయకొండ (మద్దిపూడి): కొండపి గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేసి విజయోత్సవ సభ నిర్వహిస్తానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ధీమా వ్యక్తం చేశారు. కొండపిలో సోమవారం నామినేషన్ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి సురేష్ మాట్లాడారు. నామినేషన్ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి 40 వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించామని, కానీ అంచనాలను మించి 50 వేల మందికి పైగా హాజరై జయప్రదం చేశారని చెప్పారు. మీ అందరికీ కృతజ్ఞుడనని, మీరు తనపై చూపించిన ఆదరాభిమానాలతో కొండపి గడ్డపై అఖండ మెజారిటీతో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తానన్నారు. కానీ పచ్చపత్రికలు నేడు వచ్చిన జనసందోహాన్ని చూసి సహించలేక అసత్య ప్రచారానికి తెరతీస్తాయని అటువంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని హితవు పలికారు. వారు ఎంతలా తిమ్మిని బమ్మిని చేద్దామని ప్రయత్నించినా ప్రజలు వారిని నమ్మే పరిస్థితి లేదన్నారు. ఓటు అనే ఆయుధంతో ప్రజలు ప్రతిపక్షాల ఎత్తులు, కుయుక్తులు, హింసా రాజకీయాలు, హత్యా రాజకీయాలకు చరమగీతం పాడతారని ఇది తథ్యం అన్నారు. తాను ఇప్పుడు ఏమి మాట్లాడనని నాలుగు నెలల కాలంలోనే మీరు చూపిన ఆదరాభిమానాలు చూసి మాటలు రావడం లేదని జూన్ 4న జరిగే విజయోత్సవ సభలో తాను మాట్లాతానని భావోద్వేగంతో అన్నారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రభుత్వ పథకాల వలన పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాడని 175 సీట్లు గెలిచి మళ్లీ ముఖ్యమంత్రి కావటం ఖాయమన్నారు.

నామినేషన్ దాఖలు

ముందుగా మంత్రి, సురేష్ కొండపి తహసీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం 2.05 గంటలకు నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పల్లెర్ల నరసింహా రెడ్డి, కొండపి వైస్ ఎంపీపీ రావులపల్లి కోటరాజు, ఎస్. రాజా దాఖలు చేయగా, రెండో సెట్‌లో మంత్రి సురేష్‌తో పల్లెర్ల నరసింహారెడ్డి, సింగరాయకొండ పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్ రెడ్డి, బొక్కిసం ఉపేంద్ర, పొన్నలూరు ఎంపీపీ మాధవరావు పాల్గొన్నారు. తరువాత మంత్రి సురేష్ కుమారుడు విశాల్ ఒక సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. కార్యక్రమంలో పాల్గొనటానికి వస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులరెడ్డి కె. ఉప్పలపాడు వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకు పోయి ముందుకు రాలేక వెనక్కి తిరిగి వెళ్లారు.

జన సునామి

ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డి జరుగుమల్లి మండలం వావిలేటిపాడు అడ్డరోడ్డు వద్ద మంత్రి సురేష్ ర్యాలీలో పాల్గొని తరువాత టంగుటూరు వరకు జరిగిన ర్యాలీలో పాల్గొని అక్కడ నుంచి వెనుదిరిగారు. కార్యక్రమంలో పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్ రెడ్డి, మంత్రి కుమారుడు ఆదిమూలపు విశాల్, ఆరు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సురేష్‌కు భారీ మెజారిటీ అందించాలి

టంగుటూరు: రానున్న ఎన్నికలల్లో మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు భారీ మెజారిటీ అందించాలని ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ నామినేషన్ సందర్భంగా వావిలేటిపాడు అడ్డ రోడ్డు మీదుగా వచ్చి టంగుటూరు బొమ్మల సెంటర్లో అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రాం విగ్రహాలకు మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి నివాళులర్పించారు. అనంతరం ప్రజలు అభివాదం తెలుపుతూ ఉప్పలపాడు మీదగా కొండపి వైపు కదిలారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, కొండపి ఏఎంసీ డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, మండలంలోని అన్ని గ్రామాల నాయకుల ఆధ్వర్యంలో ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి బాధ్యత నాది..
రాంబాబును గెలిపించే బాధ్యత మీది


ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే అన్నా, జంకె, హనుమారెడ్డి


ర్యాలీకి హాజరైన అశేష జనవాహిని

- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి
- కందుల బెదిరింపు రాజకీయాలకు భయపడేది లేదు: అన్నా రాంబాబు
- కర్ర పట్టుకుంటే రౌడీ అవుతాడా ? : జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: 'అభివృద్ధి బాధ్యత నాది.. అన్నా రాంబాబును అత్యధిక మెజారిటీతో గెలిపించే బాధ్యత మీద'ని వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ మార్కాపురం అభ్యర్థిగా అన్నా రాంబాబు నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో చెవిరెడ్డి పాల్గొని మాట్లాడారు. వేలాదిమంది ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందగా తరలిరావడం చూస్తుంటే జగనన్నపై, అన్నా రాంబాబుపై ఎంత అభిమానం ఉందో అర్థమవుతోందన్నారు. చరిత్రలో ఈ రోజు నిలిచిపోతుందన్నారు. నిజాయితీ పరుడుగా, మీ కుటుంబసభ్యుల్లో ఒకరిగా ఉన్న అన్నా రాంబాబును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అన్నా రాంబాబు అందరికీ ఉపయోగపడే వ్యక్తి అని అందరూ ఆశీర్వదించాలని కోరారు. తాను మార్కాపురం నియోజకవర్గంలోనే శాశ్వత నివాసం ఏర్పాటుచేసుకొని ఉంటానని భాస్కర్‌రెడ్డి అన్నారు. సంక్షేమ ప్రభుత్వం కొనసాగాలంటే రెండో సారి జగనన్నను సీఎం చేసుకోవాలన్నారు.

కందుల బెదిరింపులకు భయపడేది లేదు..

మార్కాపురం టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని, ఆయన బెదిరింపులకు ఎవ్వరూ భయపడరన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో కుల, మత ప్రాతిపధికన విడదీసి రాజకీయాలు చేయాలని చూస్తే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. 2009లో ఎమ్మెల్యేగా 2014 నుంచి 2019 వరకూ ఇన్‌చార్జిగా మార్కాపురం నియోజకవర్గానికి ఏం ఒరగబెట్టావో ప్రజలకు తెలుసన్నారు. ప్రజలను రెచ్చగొట్టి భయభ్రాంతులకు గురిచేసి చనిపోతానని బెదిరిస్తూ రాజకీయాలు చేయడం మంచిది కాదన్నారు. నారాయణరెడ్డి చెప్పినట్లు ప్రజలెవరూ కులాలు, మతాల ప్రకారం విడిపోరని, విజ్ఞత కలిగిన ఓటర్లు కందుల ఉచ్చులో పడరన్నారు. పదవికోసం తాను ఏనాడు పాకులాడలేదని, రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఇన్‌చార్జిగా ఉన్నానన్నారు. నారాయణరెడ్డికి పదవి ముఖ్యమో.. ప్రాణం ముఖ్యమో.. తేల్చుకోవాలన్నారు.

కర్ర పట్టుకుంటే రౌడీ అవుతాడా : జంకె వెంకటరెడ్డి

కర్ర పట్టుకున్న ప్రతివాడు రౌడీకాలేడనే విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తుపెట్టుకోవాలని, ప్రజాస్వామ్యంలో దాడులు చేయడం మంచి పద్ధతి కాదని ఏపీఐఐసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి హెచ్చరించారు. నీచ రాజకీయాలకు పాల్పడేవారిని తరిమికొట్టాలన్నారు. 14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు వెలిగొండను విస్మరించి మళ్లీ తానే వెలిగొండను ప్రారంభిస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇటీవలే వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జాతికి అంకితం చేసిన విషయాన్ని చంద్రబాబు మర్చిపోయానన్నారు. కరువు సీఎంగా పేరు తెచ్చుకున్న చంద్రబాబును ప్రజలు మరోసారి ఆయనకు బుద్ధి చెబుతారన్నారు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో అన్నా రాంబాబును, ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మేలు చేసే ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలని కోరారు. ఓట్లు వేయకపోతే ఛస్తానని బెదిరిస్తే ప్రజలు ఓట్లు వేయరని కందుల నారాయణరెడ్డిని ఉద్దేశించి అన్నారు. రాజకీయాల్లో దమ్ము, ధైర్యం ఉండాలని దౌర్జన్యాలు, బ్లాక్‌మెయిల్ చేసేవారికి స్థానం ఉండదన్నారు. ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు వెన్నా హనుమారెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్ మాట్లాడుతూ మార్కాపురం నియోజకవర్గ ప్రజలంతా ఆలోచించి సంక్షేమాన్ని కొనసాగించేందుకు వీలుగా అన్నా రాంబాబు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. ర్యాలీలో సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

హాజరైన అశేష జనవాహిని..

అన్నా రాంబాబు నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా వేలాదిమంది కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. తీవ్రమైన ఎండను సైతం లెక్కచేయకుండా జై జగన్.. అంటూ నినాదాలతో హోరెత్తించారు. సప్తగిరి లాడ్జి నుంచి ప్రారంభమైన ర్యాలీ దోర్నాల బస్టాండు, నాయుడు వీధి, తేరుబజారు మీదుగా, పాత బస్టాండు నుంచి కంభం సెంటరు వరకూ సాగింది. ర్యాలీలో పార్టీ నాయకులు ఉడుముల కోటిరెడ్డి, కంభానికి చెందిన చెన్నారెడ్డి, లయోలా చెంచిరెడ్డి, గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన పలువురు ఎంపీపీలు, జడ్పీటీసిలతోపాటు మార్కాపురం పట్టణ ప్రధాన కార్యదర్శులు పత్తి రవిచంద్ర, బొగ్గరపు శేషయ్య, గొలమారి శివారెడ్డి, రొజ్‌లిడియా, జడ్పీటిసి నారు బాపన్ రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ గొలమారి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి

- కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్


పొందూరులో ఎన్నికల నియమావళిపై మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

టంగుటూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకొనేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఏ. ఎస్. దినేష్ కుమార్ తెలిపారు. పొందూరు, మద్దిపూడి మండలం రామయ్యపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రవర్తన నియమావళి అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని స్వేచ్ఛగా, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలన్నారు. పోలింగ్ రోజున అన్ని ఏర్పాట్లను పటిష్ఠంగా చేపడుతున్నట్లు తెలిపారు. 85 సంవత్సరాలు దాటి పోలింగ్ కేంద్రానికి రాలేని వారికి హోం ఓటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ధైర్యంగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు అవసరమైన భద్రతా ఏర్పాట్లను పటిష్ఠంగా చేపడుతున్నట్లు తెలిపారు. తొలుత ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఓటు హక్కు ప్రాధాన్యత పై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.

ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరిగిన ఎదుర్కొనేలా స్పెషల్ టీం, డిఫెన్స్ డ్రిల్ నిర్వహించారు. కొండపి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కుమార్, ఒంగోలు డీఎస్పీ పి. కిషోర్ బాబు, కనిగిరి డీఎస్పీ ఆర్. రామరాజు, సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, కొండపి సీఐ పాండురంగారావు, మద్దిపూడి ఎస్సై, సింగరాయకొండ, టంగుటూరు ఇన్‌చార్జి ఎస్సైలు శ్రీరామ్, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల గుండెల్లో సుస్థిర స్థానం

- వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి ఆదిమూలపు సురేష్


కొండపిలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

సింగరాయకొండ (కొండపి): వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నామినేషన్ కార్యక్రమం కనీవినీ ఎరుగని రీతిలో జయప్రదంగా జరిగిందని, దీనిని బట్టి నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ధీమా వ్యక్తం చేశారు. కొండపిలో సోమవారం నామినేషన్ దాఖలు చేసిన తరువాత ఆయన విలేకరులతో మాట్లాడారు. నామినేషన్ వేసేందుకు సింగరాయకొండ నుంచి కొండపికి 35 కిలోమీటర్లు రావటానికి సుమారు 5 గంటల సమయం పట్టిందని, దీనిని బట్టి ఈ కార్యక్రమానికి ఏ స్థాయిలో ప్రజలు స్వచ్ఛందంగా హాజరయ్యారో అర్థమవుతోందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గంలో కలిసికట్టుగా గెలుపునకు కృషి చేస్తారన్నారు. జగనన్న ఇచ్చిన సంక్షేమ పథకాలతో పేదల గుండెల్లో నిలిచారని, రాబోయే ఎన్నికల్లో 175 సీట్లు ఖాయమన్నారు. ప్రతిపక్షాలు ప్రజా సంక్షేమం తప్పపొత్తులు, కులసమీకరణలపై ఆధారపడి రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, ఎవరు విశ్వసనీయులో ప్రజలకు అర్థమవుతుందన్నారు. జగనన్న పాలన నిజాయతీ, నిబద్ధతతో సాగిందని, చంద్రబాబు పాలన మోసం, వంచనతో జరిగిందని గుర్తు చేశారు. ఈరోజు ఒకరు ప్రజల పక్షాన నిలబడితే, మరొకరు పెత్తందారీ పక్షన నిలిచారన్నారు. కార్యక్రమంలో పాల్గొనటానికి ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వస్తుండగా ట్రాఫిక్ సమస్య కారణంగా వెనక్కి తిరిగి వెళ్లిపోయారన్నారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. వీరిద్దరి ఆశీస్సులతో ఈ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలుపొందుతానని అన్నారు. మంత్రి సురేష్ కుమారుడు ఆదిమూలపు విశాల్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పల్లెర్ల నరశింహారెడ్డి, సింగరాయకొండ వైస్ ఎంపీపీ, పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చుక్కా కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు ఆత్మహత్య


మృతుడు మహేష్ బాబు

సంతనూతలపాడు(చీమకుర్తి): ఒంగోలు నగరంలో సంచలనం సృష్టించిన ఏటీఎం వాహనం నగదు చోరీ కేసులో ప్రధాన నిందితుడు సన్నమూరు మహేష్ బాబు అనూహ్య రీతిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నిందితుడి స్వగ్రామమైన సంతనూతలపాడు మండలం కామేపల్లివారిపాలెంలో సోమవారం వేకువజామున చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి బంధువుల కథనం మేరకు.. ఒంగోలు ఆర్టీసీ డిపో సమీపంలో ఈ నెల 18న ఏటీఎంలలో నగదు నింపే సీఎంఎస్ వాహనం నుంచి రూ.68 లక్షలు అపహరణకు గురికాగా, సంస్థలో పనిచేసి మానేసిన సంతనూతలపాడు మండలం కామేపల్లివారి పాలెం గ్రామానికి చెందిన సన్నమూరు మహేష్‌బాబు, ఇతని బావమరిది రాచర్ల రాజశేఖర్, సీఎంస్ సంస్థ మేనేజర్ గుజ్జుల వెంకటకొండారెడ్డిని నిందితులుగా గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 19న ముగ్గురు నిందితులూ స్టేషన్ బెయిల్‌పై విడుదలయ్యారు. అప్పటి నుంచి ఇంటికి వెళ్లేందుకు ఇష్టపడని సన్నమూరు మహేష్ బాబు కుటుంబ సభ్యులు ప్రాధేయపడటంతో ఆదివారం రాత్రి స్వగ్రామానికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులతోనూ పొడిపొడిగా మాట్లాడి తన గదిలోకి వెళ్లాడు. సోమవారం ఉదయం మహేష్‌బాబు గదిలో ఫ్యాన్ తిరుగుతున్న శబ్దం రాకపోవడాన్ని గమనించిన సోదరుడు స్వామిశేఖర్ అనుమానంతో కిటికీ తెరిచి చూడగా ఉరికి వేలాడుతున్నాడు. కుటుంబ సభ్యులు తలుపులు బద్దలుకొట్టి వెళ్లి చూడగా అప్పటికే మహేష్‌బాబు మృతి చెంది ఉన్నాడు. సంతనూతలపాడు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై దేవకుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సూసైడ్ నోట్‌లో ఏముంది?

నగదు చోరీ చేసి పోలీసులకు పట్టుబడటం, తదనంతర పరిణామాలతో మనస్తాపం చెంది మహేష్‌బాబు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మహేష్‌బాబు ఆత్మహత్యకు ముందు రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తన బావమరిది రాచర్ల రాజశేఖర్‌కు చోరీతో ఎలాంటి సంబంధం లేదని, సీఎంఎస్ మేనేజర్ కొండారెడ్డి ప్రోద్బలంతోనే నగదు చోరీ చేసినట్లుగా మహేష్ తన సూసైడ్ నోట్‌లో రాశాడని బంధువులు చెప్పారు.

బాలికపై ప్రభుత్వ ఉద్యోగి లైంగిక వేధింపులు

ఒంగోలు సబర్బన్: నగరంలోని ముంగమూరు రోడ్డులో ఉన్న హనీ టవర్స్‌లో బాలికను అదే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ఒక ప్రభుత్వ ఉద్యోగి లైంగికంగా వేధిస్తున్నాడంటూ తాలూకా పోలీసులకు ఫిర్యాదు అందింది. బాలిక కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒంగోలు తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒంగోలు దిశ పోలీస్‌స్టేషన్‌కు ఆ ఫిర్యాదును విచారణ నిమిత్తం బదిలీ చేశారు. బాలికను వేధిస్తున్న ప్రభుత్వ ఉద్యోగి డీఆర్‌డీఏ పనిచేస్తున్నట్లు సమాచారం. 16 ఏళ్ల బాలికను 60 ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగి లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ దిశగా దిశ పోలీసులు విచారిస్తున్నారు.

ఆటో బోల్తా

పీసీపల్లి: ఆటో బోల్తా పడి 10 మందికి గాయాలైన సంఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..పెదయిర్లపాడు నుంచి వేపగుంపల్లికి రోజు మిర్చి కోతకు కూలీలు ఆటోలో వెళ్తుంటారు. రోజు వారిగానే సోమవారం ఆటోలో ఉదయం 5.30 గంటలకు బయలుదేరారు. ఈ క్రమంలో వెంగాయపల్లి వద్ద కుక్క అడ్డు రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం కనిగిరి వైద్యశాలకు పంపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.